క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చెన్నారావుపేట : మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా రెండు రోజులు (శని, ఆదివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ జోగానంద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు చెన్నారావుపేట, మగ్దుంపురం ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

'గృహలక్ష్మి' పనులు ప్రారంభం



ఖానాపురం : మండలంలోని మనుబోతులగడ్డ గ్రామంలో శుక్రవారం సర్పంచ్ సోమయ్య, సొసైటీ డైరెక్టర్ అశోక్ ఆధ్వర్యంలో గృహలక్ష్మి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి గృహలక్ష్మి పథకం వర్తింపజేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించాలి

పర్వతగిరి : విశ్వకర్మ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి సతీష్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈనెల 17వ తేదీన అధికారికంగా నిర్వహించే విశ్వకర్మ జయంతి కార్యక్రమానికి జాతీయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

'సమస్యలు పరిష్కరిస్తాం'

ఖానాపురం : మండలంలోని సైనిక్ స్కూల్‌లో పేరుకుపోయిన సమస్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు రాజు, లాలు, విక్రం, కిషన్‌లతో పాటు మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా సైనిక్‌స్కూల్‌లో నెలకొన్న సమస్యలపై మంత్రి సత్యవతిరాథోడ్‌తో పాటు గురుకులాల కార్యదర్శికి ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు సైనిక్ స్కూల్‌కు వస్తున్నారని తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు వివిధ ప్రాంతాల నుంచి శుక్రవారం పాఠశాలకు చేరుకున్నారు. అధికారులు ఎవరూ రాకపోవడంతో స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావుతో వాగ్వాదానికి దిగారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని, సైనిక్ స్కూల్‌లోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు వెనుదిరిగారు.

కస్తూర్బాలో వైద్యశిబిరం



నెక్కొండ : వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని అలంకానిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద్దకొర్పోలు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శిబిరంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ సునీత, వైద్యురాలు సుధ, సూపర్‌వైజర్ రాజు, ఏఎన్ఎం కరుణ, ఆశ కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను వివరించాలి



పర్వతగిరి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ పార్టీ విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌లు రంగు కుమార్‌గౌడ్(పార్టీ మండల అధ్యక్షుడు), బూర శ్యామ్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కల్లెడ గ్రామంలో సంక్షేమ పథకాల అమలు, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్య కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, సర్పంచ్ సంపెల్లి శోభపరమేశ్వర్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్, ఉపసర్పంచ్ చేనురి సోమయ్య, పిట్టల రాజు, అదొండ చేరాలు, శ్రీకాంత్, సారయ్య, యాదగిరి, వెంకటయ్య, సంపత్, ఐలయ్య, వెంకన్న, రాకేష్, రాజు, శ్రీనివాస్, బాబు, ఉప్పలయ్య, సంపత్, వీరాస్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

● ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



కుంటపల్లి చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి తదితరులు

సంగెం : మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. కుల వృత్తులను ప్రోత్సహించడంతో పాటు పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పని చేస్తున్నారని ఆయన తెలిపారు. శుక్రవారం సంగెం మండలంలోని కుంటపల్లి ఊర చెరువులో ప్రభుత్వం అందజేసిన ఉచిత చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో మత్స్యకారులు నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. మత్స్యకారుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని అన్నారు. వందశాతం సబ్సిడీతో చేపలు, రొయ్యల పెంపకానికి ప్రభుత్వం చేయూతనిస్తుండడంతో రాష్ట్రంలో నీలి విప్లవం వచ్చిందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు కానీ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసి పేదలకు అందజేస్తున్నారని తెలిపారు. ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ కావటి వెంకటయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న కే.ఆర్ నాగరాజు

వర్ధన్నపేట : వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరాన్ని శుక్రవారం కాంగ్రెస్ నేత కే.ఆర్ నాగరాజు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ సేవలకు వినియోగిస్తూ వారి న్యాయమైన డిమాండ్లను తీర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. అంగన్‌వాడీలకు మంచి రోజులు వచ్చే కాలం ముందుందని వారి సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. సంఘీభావం తెలిపిన వారిలో బొంపల్లి దేవేందర్‌రావు, కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, ఎద్దు సత్యనారాయణ, పోలెపెల్లి బుచ్చిరెడ్డి, కొమ్ము రమేష్, సమ్మెట సుధీర్, కొండేటి బాలకృష్ణ, కీమా నాయక్ తదితరులు ఉన్నారు.

తొగరు చెన్నారెడ్డి అరెస్ట్!



చెన్నారావుపేట : మండలంలోని జల్లీ గ్రామానికి చెందిన తొగరు చెన్నారెడ్డిని ఆయన నివాసంలో ఎస్సై తోట మహేందర్ శుక్రవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. పలు కేసుల విషయంలో అదుపులోకి తీసుకుని హనుమకొండలోని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. కాగా, చెన్నారెడ్డిని అరెస్టు చేసి హనుమకొండకు తీసుకెళ్తున్న క్రమంలో పోలీసుల వాహనాన్ని వెంబడించిన పలువురిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సై తోట మహేందర్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు.

పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి



జోహార్లు అర్పిస్తున్న ఎంసీపీఐయు నాయకులు

సంగెం : తెలంగాణ సాయుధ పోరాట యోధుల స్ఫూర్తితో ఉద్యమించాలని ఎంసీపీఐ(యు) మండల కార్యదర్శి ఎండి. ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఎల్గూర్‌రంగంపేటలో తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సాయుధ పోరాటంలో అనేకమంది భూస్వాములకు వ్యతిరేకంగా ఎర్ర జెండాలతో ఉద్యమించారని తెలిపారు. ఈ ఉద్యమంలో అమరులైన వారికి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో నారగోని ఎల్లగౌడ్, గోనె రాంచందర్, రౌతు శ్రీనివాస్, సోమిరెడ్డి సాంబయ్య, ఎనబోతుల సాంబయ్య, ఐలయ్య, సుశీల, రాజేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్ : చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మండలం రెడ్లవాడ గ్రామంలో చోటుచేసుకుంది. శుక్రవారం టౌన్ సీఐ వై.సతీష్ తెలిపిన వివరాలు.. రెడ్లవాడకు చెందిన మాలోత్ స్వామి(35), అతని తమ్ముడు మాలోత్ రమేశ్ 2వ తేదీన పని నిమిత్తం మహబూబాబాద్ పట్టణానికి వచ్చారు. స్వామి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. రమేశ్ వెళ్లి చూడగా స్పృహ లేకుండా పడి ఉన్నాడు. వెంటనే వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ స్వామి మృతి చెందాడు. స్వామి తమ్ముడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

విజయభేరి సభకు తరలిరావాలి




సమావేశంలో మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

పర్వతగిరి : రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో ఈనెల 17వ తేదీన నిర్వహించే విజయ భేరి సభకు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి దిలీప్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే విజయభేరి సభకు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న రాచరిక పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకువచ్చే విధంగా విజయభేరి సభ ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందన్నారు. సోనియాగాంధీ విజయభేరి సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొంకపాక ఉపసర్పంచ్ రంగు రంజిత్‌గౌడ్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నరుకుడు రవీందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవరాజ్, యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ కార్యదర్శి రేష్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నీరటి ప్రశాంత్, పంతంగి దేవేందర్, గోపనపల్లి యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాము, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేందర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

'బినామీలతో భూ కబ్జాలు'

ఐనవోలు : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ తన బినామీలతో భూ కబ్జాలు చేయిస్తూ పర్యావరణానికి విరుద్ధంగా పట్టణాలను తయారు చేయడమే కాక కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారని ఏఐసీసీ సభ్యుడు బక్క జడ్సన్ ఆరోపించారు. ఇదివరకే అరూరి రమేష్‌పై ఈడీ, విజిలెన్స్, సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఊర చెరువును జడ్సన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గ వ్యాప్తంగా అనేక చోట్ల అరూరి రమేశ్ వల్ల చెరువుల మత్తడి కింద రైతులు తీవ్ర ఇబ్బందులు పోతున్నట్లు తెలిపారు. మండలంలోని పంథిని గ్రామంలో ఇటీవల తన పర్యటన సందర్భంగా శిఖం భూమిని బినామీలతో కబ్జా చేయించి కాంపౌండ్ కడుతున్న విషయాన్ని ప్రజలకు తెలియజేశానన్నారు. అయితే మండల కేంద్రంలోని ఊర చెరువు కింద సుమారు 50 ఎకరాలకు నీరు రాకుండా చెరువు తూము నుంచి వచ్చే కాల్వను మధ్యలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎమ్మెల్యే అండదండలతో మూసి వేశారని ఆరోపించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న మాసాని గోపాల్

వర్ధన్నపేట : పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని కోరుతూ శుక్రవారం వర్ధన్నపేటలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాసాని గోపాల్ హాజరై మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెడతామని హామీ ఇచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్న ఇప్పటి వరకు ప్రవేశపెట్టక పోవడం మాదిగలను మోసం చేయడమేనన్నారు. వరంగల్‌కు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీని మంద కృష్ణ మాదిగ కలిసి ఈ విషయంపై మాట్లాడడంతో వర్గీకరణ బిల్లు చేస్తామని హామీ ఇచ్చి పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టక పోవడంతో మాదిగలను నిరుత్సాహానికి గురి చేసిందన్నారు. సమావేశంలో గోలి సుధాకర్, తాళ్ల రమేష్, బిర్రు బిక్షపతి, సీనపెల్లి రాజు, అరుణకుమార్, సుకుమార్, దేవేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

హసన్‌పర్తి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి మండలం నాగారానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండపాక సుకన్య, మాజీ సర్పంచ్ రఘు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఎల్లాపురంలో విశ్వబ్రాహ్మణ కమిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అరూరి రమేష్ హామీఇచ్చారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ విశ్వబ్రాహ్మణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నివాళులర్పిస్తున్న దొంతి మాధవరెడ్డి

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన కాట్ల కొమురమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. కాగా కొమురమ్మ మృతదేహంపై మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, సర్పంచ్ సిద్దన రమేష్, హరీష్‌రెడ్డి, హరిప్రసాద్, బండి హరిష్, కేశవులు ఉన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి..

నర్సంపేట : స్వాతంత్ర్య సమరయోధుడు పెండెం కట్టయ్య కుమారుడు, టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ తండ్రి పెండెం ఆనంద్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ సందర్భంగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం ఆనంద్ మృతదేహాన్ని సందర్శించి భౌతిక కాయంపై కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్ ఆనంద్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్లు పాల్గొన్నారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండాల మదన్‌కుమార్ సైతం ఆనంద్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'గార్డియన్'లో ఉచిత ఆపరేషన్

ఎంజీఎం: గార్డియన్ ఆస్పత్రిలో ఓ నిరుపేద కుటుంబానికి ఉచితంగా ఆపరేషన్ చేశారు. సంగెం మండలం ఆశాలపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన రాయరపు రవికి రూ.1.50 లక్షల విలువగల శస్త్రచికిత్సను ఉచితంగా నిర్వహించినట్లు డాక్టర్ కాశీప్రసాద్ తెలిపారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

● పలువురు అధికారుల గైర్హాజరు



నివేదిక చదివి వినిపిస్తున్న డాక్టర్ జ్యోతి

ఖానాపురం : మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అధ్యక్షతన ఉదయం సమావేశం ప్రారంభించగా అధికారులు, ప్రజా ప్రతినిధులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. అధికారులు ఇలా వచ్చి.. నివేదికలు చదువుతూ వెళ్లిపోయారు. వ్యవసాయ శాఖపై ఏఓ శ్రీనివాస్, పీహెచ్‌సీపై డాక్టర్ జ్యోతి, విద్యుత్ శాఖపై ఏఈ సంపత్‌లు నివేదికలు చదివి వినిపించారు. శ్మశాన వాటికలకు విద్యుత్ సదుపాయం లేదని, డీడీలు కట్టిన తర్వాత కూడా నిర్లక్ష్యం ఏంటని సర్పంచ్‌లు చిరంజీవి, కవిత, ఎంపీటీసీ శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్ శాఖపై ఇన్‌చార్జ్ ఏఈ మోహన్‌రావు నివేదికలు వినిపించగా రోడ్ల పనులు పూర్తి చేసి బిల్లులు మంజూరు చేయించాలని ఎంపీటీసీ పూల్‌సింగ్ తెలిపారు. తాగు నీటిపై ఏఈ మౌనిక నివేదించగా బుధరావుపేటలో మిషన్ భగీరథ పైపులైన్ పూర్తి చేయాలని ఎంపీటీసీ సుభాన్‌బీ కోరారు. ఇరిగేషన్ ఏఈ రమేశ్ మాట్లాడుతూ కాల్వలపై లష్కర్లు ఏర్పాటునకు తీర్మానం చేయాలని కోరగా ఎంపీపీ ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. ఇదే సమయంలో సర్పంచ్ బాలకిషన్ మాట్లాడుతూ.. సమావేశానికి తహసీల్దార్‌లు రావడం లేదని, గ్రామాల్లోనే డీలర్ షాపులు, పెన్షన్లు అందించాలని, వీటిపై తీర్మానం చేయాలని కోరడంతో వారు ఆమోదించారు. సెరికల్చర్ అధికారి సంజీవరెడ్డి మాట్లాడుతూ పెట్టుబడిలేని పంటలు సాగు చేసుకొని లాభాలు పొందాలని సూచించారు. పలు శాఖల అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంతో సమావేశాన్ని ముగించారు. సమావేశంలో ఎంపీడీఓ సుమణవాణి, వైస్ ఎంపీపీ ఉమారాణి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తక్షణమే సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీఎస్ఎఫ్ నాయకులు

నర్సంపేట రూరల్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం నర్సంపేట పట్టణంలోని ద్వారకపేట రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధాన గేటు ఎదుట ఏబీఎస్ఎఫ్ నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట డివిజన్‌లోని వివిధ గ్రామాల నుంచి ఉన్నత విద్యను అభ్యసించేందుకు కళాశాలకు 350మంది విద్యార్థులు వస్తున్నారన్నారు. వారికి అనుగుణంగా మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జూనియర్ కళాశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, తరగతి గదుల్లో స్లాబ్ పెచ్చులూడి కిందపడుతున్నాయని, ఆసమయంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉంటే పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కళాశాల ఆవరణ అంతా బురదమయంగా మారిందని, దీంతో తరగతి గదుల్లోకి వెళ్లాలంటే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. కళాశాలలో వాటర్ ప్లాంట్ మరమ్మతు చేయించి మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈసమస్యలను ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే పరిష్కరించాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏబీఎస్ఎఫ్ నాయకులు సిద్దు, ప్రశాంత్, రవి, నిఖిల్, రవీందర్, కృష్ణ పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

● రెండు బైక్‌లు స్వాధీనం



ఇల్లందలో పట్టుబడిన బైక్, గుడుంబాను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

వర్ధన్నపేట : బైక్‌లపై గుడుంబా తరలిస్తున్న ఇద్దరిని శుక్రవారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. ఇల్లందలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్‌చందర్ ఆధ్వర్యంలో రూట్ వాచ్ చేస్తుండగా వర్ధన్నపేట పట్టణ పరిధిలోని గుబ్బెడ తండాకు చెందిన బానోత్ యాకూబ్ బైక్‌పై గుడుంబాను వరంగల్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు. నీలగిరిస్వామి తండాకు చెందిన బానోత్ భాస్కర్ బైక్‌పై గుడుంబాను తరలిస్తుండగా వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఇద్దరి నుంచి రెండు బైక్‌లు, 19 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎక్సైజ్ పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు రాజమౌళి, పరశురాములు, సంతోష్ పాల్గొన్నారు.

మహిళలకు పెద్దపీట వేసింది కాంగ్రెసే..



కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న పార్వతమ్మ

నర్సంపేట : దేశంలో మహిళలకు పెద్దపీట వేసింది కాంగ్రెస్ అని పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ అన్నారు. ఈ మేరకు అఖిల భారత మహిళా కాంగ్రెస్ 40వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి మొదటి మహిళా ప్రధాని, రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్‌ను నియమించి మహిళల ఔన్నత్యాన్ని చాటింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలకు ఐదు మంత్రి పదవులు ఇవ్వనున్నట్లు అధిష్ఠానం ప్రకటన చేసిందని తెలిపారు. గృహిణులకు రూ.3వేలు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మేనిఫెస్టోలో పెట్టిందన్నారు. పట్టణ అధ్యక్షురాలు నూనె పద్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ పద్మబాయి, శిరీష, బ్లాక్ కాంగ్రెస్ సంగెం మండల అధ్యక్షురాలు కవిత, దుగ్గొండి మండలం మధిర సర్పంచ్ సునీత, కౌన్సిలర్ అంజలి, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ పాల్గొన్నారు.


మట్టి గణపతి విగ్రహాలనే పూజిద్దాం..



ర్యాలీలో మాట్లాడుతున్న రావుల భాస్కర్‌రావు

రాయపర్తి : మట్టి గణపతి విగ్రహాలను పూజించి.. జీవవైవిధ్యాన్ని కాపాడుదామని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రావుల భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట ఆధ్వర్యంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాలకు సింథటిక్ అనేక రకాల రసాయనిక రంగులు వేయడానికి ఉపయోగించిన పదార్థాల వల్ల చెరువుల్లో నీళ్లు కలుషితమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రావుల అనిల్ కుమార్, సునీల్, సతీష్, రిటైర్డ్ టీచర్ ఆకుల నరేందర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ దినోత్సవం



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డేను నిర్వహించారు. ఈ వేడుకలను బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కళాశాల ఆవరణలో ఇంజనీర్ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన టెక్నికల్ క్విజ్, ఐడియా ప్రజెంటేషన్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. బాలాజీ విద్యా సంస్థల సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, కళాశాల కోశాధికారి వనజారెడ్డి, ప్రిన్సిపాల్ హరిహరన్, అకాడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ఏఓ సురేష్, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఆఫైర్స్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.